క్లుప్తంగా

నేడు కాంట్రాక్టు కమిటీ సమావేశం

సామర్లకోట: మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ చాంబర్‌లో శనివారం ఉదయం 11 గంటలకు కాంట్రాక్టు కమిటీ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించనున్నామని, అదే విధంగా పట్టణ పరిధిలో పందులు, కుక్కల నివారణకు తీసుకోవలసిన చర్యలపై చర్చిస్తున్నట్టు తెలిపారు.

రహదారిని బాగుచేయరూ..



పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో ప్రమాదకరంగా మారిన గొయ్యి

కొత్తపల్లి: మండలంలోని శ్రీరాంపురం రహదారిలో ప్రయాణం నరకమేనని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీచ్‌రోడ్డు నుంచి శ్రీరాంపురానికి సుమారు కిలోమీటరు మేర గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ గ్రామం నుంచి కోనపాపపేట పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ప్రమాదాల పాలవుతున్నారన్నారు. వర్షం పడితే ఈ పరిస్థితి మరీ ఇబ్బందిగా ఉందని అన్నారు. అధికారులు రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

- 49 సీసాలు స్వాధీనం



మద్యం సీసాలతో నిందితులు

సామర్లకోట: స్థానిక మఠంసెంటర్‌లో మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం రావడంతో గురువారం రాత్రి రెండు స్థావరాలపై దాడులు చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. సీఐ కె.దుర్గాప్రసాద్ కథనం మేరకు రిపబ్లిక్ డే సందర్భంగా మద్యం దుకాణాలు మూసివేయడంతో ఆయా దుకాణాల నుంచి సరకు తీసుకువచ్చి మఠంసెంటర్‌లో విక్రయిస్తున్నారన్న సమాచారంతో నూకల నరసింహమూర్తి, గుమ్మెళ్ల సత్యనారాయణలను అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరి నుంచి 49 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ సుమారు రూ.10 వేలు ఉంటుందని చెప్పారు. నిందితులను ఎక్సైజ్ కోర్టుకు తరలించామని తెలిపారు.

పంటకాలువ పూడ్చేస్తున్నారు..



వాకతిప్పలో పంటకాలువను పూడుస్తున్న పొక్లెయిన్, సిద్ధం చేసిన గ్రావెల్

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో పంట కాలువలను లే అవుట్ పేరుతో పూడ్చేస్తున్నారు. పంటకు సాగునీరు వెళ్లే కాలువలో చిన్న చిన్న తూరలు వేసి పొలాలకు సాగునీరు అందకుండా గ్రావెల్‌తో పూడ్చేశారు. దీంతో సాగు నీరు అందడంలేని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా లే అవుట్ ఏర్పాటుకు ఎటువంటి అనుమతులు లేవని, పంట కాలువను పూడ్చడం నేరమని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టి తీసుకువెళతామన్నారు.

క్రాస్ బౌ విజేతలకు ఎస్పీ అభినందనలు

కాకినాడ క్రైం: జాతీయ స్థాయి క్రాస్ బౌ షూటింగ్ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించిన బాలలు వేదదీక్షిత్, కార్తికేయ, సత్యనారాయణ, సాదిక్ ఖాన్‌లను ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు శుక్రవారం ఆయన కార్యాలయంలో అభినందించారు. రాష్ట్రం నుంచి కాకినాడ ప్రో షూటింగ్ అకాడమీకి చెందిన షూటర్లయిన బాలలు నలుగురూ స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారని ఎస్పీ అన్నారు. ఎస్‌బీ డీఎస్పీ అంబికా ప్రసాద్ ఇతర అధికారులు ఉన్నారు.

డీప్ వాటర్ పోర్టు వర్కర్స్ యూనియన్ కార్యవర్గం

కాకినాడ సిటీ: లక్ష్మీ డీప్ వాటర్ పోర్టు వర్కర్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికల్లో అధ్యక్షుడిగా పట్టా ధనలక్ష్మి 134 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కార్యదర్శిగా బలసాడి వీరబాబు 65 ఓట్ల మెజారిటీ గెలుపొందారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించిన సంఘం గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ద్వారంపూడి వీరభద్రారెడ్డిలకు సంఘం ప్రతినిధులు, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పాత సామాన్లు కొంటాం..!

- ఇనుప ముక్కలుగా మారుతున్న వాహనాలు
- అశుభ్రంగా పోలీసుస్టేషన్ ఆవరణ
- పట్టించుకోని అధికారులు



పోలీసుస్టేషన్ ఆవరణలో తుప్పపట్టిన వాహనాలు

సామర్లకోట: స్థానిక పోలీసు స్టేషన్‌లో వివిధ వాహనాలు ఇనుప ముక్కలుగా మారుతున్నాయి. వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాలు ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పుపట్టి కనీసం వేలానికి కూడా పనికిరాని విధంగా తయారవుతున్నాయి. సకాలంలో అధికారుల నుంచి అనుమతులు తీసుకొని వేలం వేసి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రయత్నాలు చేయడంలేదన్న ఆరోపణలు స్థానిక అధికారులపై వినిపిస్తున్నాయి. పోలీసు స్టేషన్ ఆవరణలో సుమారు 120 వరకు మోటారు సైకిళ్లు, 10 వరకు ఆటోలు, ఐదు కార్లు, ఒక లారీ, ఒక జేసీబీ ఎందుకూ పనికిరాని స్థితిలో ఉన్నాయి.

ఆయా కేసులల్లో వాహనాలను స్వాధీనం చేసుకున్న సమయంలో యజమానులకు వాహనాలను అప్పగించి వారి నుంచి డిపాజిట్లు చేయించడం ద్వారా వాహనాలు జాగ్రత్తచేసే అవకాశం ఉంది. అటువంటి చర్యలు లేకపోవడంతో వాహనాల్లోని పలు భాగాలు గల్లంతవుతున్నాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ వాహనాలతో చెత్త ఎక్కువగా పేరుకుపోయి విష కీటకాలు స్థావరాలు ఏర్పరచుకుంటున్నాయి.

వాహనాలను వేలం వేయాలి..



కేసులు పరిష్కారమైన వాహనాలు వాహనాల యజమానులకు అప్పగించాలి. వాహనాలు తీసుకు వెళ్లని వారికి నోటీసులు జారీ చేసి వేలం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది.

– యండమూరి సుబ్బారావు, ట్రస్టు బోర్డు సభ్యుడు, సామర్లకోట

వేలం వేయిస్తాం....



పోలీసు స్టేషన్‌లో ఉన్న వాహనాలను వేలం వేయించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన వారి వాహనాలను వారి కుటుంబ సభ్యులు తీసుకువెళ్లడానికి రావడం లేదు. పరిష్కారమైన అన్ని వాహనాలను వేలం వేస్తాం. మిగిలిన వాహనాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. – కె.దుర్గాప్రసాద్, సీఐ, సామర్లకోట

నేడు రథసప్తమి వేడుకలు



పాండువుల మెట్టపై కొలువైన సూర్యభగవానుడు



పంచారామ క్షేత్రంలో సూర్యనారాయణమూర్తి

పెద్దాపురం: సుప్రసిద్ధ పాండవుల మెట్టపై సూర్యనారాయణ స్వామి ఆలయం రథ సప్తమి వేడుకలకు సిద్ధమవుతోంది. ఆలయ కమిటీ నిర్వాహకులు వై.అనంతలక్ష్మి, గీతావాణిల ఆధ్వర్యంలో శ్రీపుష్పయాగం నిర్వహించనున్నారు. సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని వారు తెలిపారు.

భువనేశ్వరి పీఠంలో..

స్థానిక వర్జుల వారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో శనివారం రథసప్తమి వేడుక నిర్వహించనున్నట్టు లలితా వాస్తు జ్యోతిష్యాలయ నిర్వాహకులు చింతా గోపిశర్మ సిద్ధాంతి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి సూర్య నమస్కార సహిత మహా సౌరహోమం నిర్వహించనున్నామని తెలిపారు. పూజల్లో పాల్గొనే భక్తులు 98661 93557 నెంబరులో సంప్రదించాలని కోరారు. తెలియజేయాలని గోపిశర్మ సిద్ధాంతి కోరారు.

నేడు స్వామివారి కల్యాణం

సామర్లకోట: స్థానిక కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలోని సూర్యనారాయణమూర్తికి శనివారం కల్యాణం నిర్వహించనున్నట్టు ఈఓ డి నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఈఓ తెలిపారు. అలాగే స్థానిక ఐదు తూముల వద్ద అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సూర్యనారాయణ మూర్తి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు పరమానందగిరి స్వామి చెప్పారు.

శ్రీపాద వల్లభా.. శ్రితపారిజాతా..



శ్రీపాద శ్రీవల్లభ స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



శ్రీపాద శ్రీవల్లభ స్వామి వారి ఆలయంలో గోపూజలు నిర్వహిస్తున్న భక్తులు

- ఘనంగా స్వామివారి ఆవిర్భావ ఉత్సవాలు
- భారీగా హాజరైన భక్తజనం

పిఠాపురం: శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో స్వామివారి 703వ ఆవిర్భావ ఉత్సవాలు మూడో రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి దర్శనానికి వేలాదిగా భక్తులు హాజరయ్యారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ రెడ్డెం జనార్ధనరావు ఆధ్వర్యంలో స్వామివారికి పల్లకి గ్రామోత్సవం, సంపూరిత మహా మృత్యుంజయ పాశుపత అభిషేకం, యాగశాల మండపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈఓ సౌజన్య ఆధ్వర్యంలో ఆలయ అధికారులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు కల్పించారు.

పట్టణంలో ముంపు నివారణకు చర్యలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడపగడపకు



లబ్ధిదారుకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: పట్టణంలో పలు వార్డుల్లో కాలువ నీటి ముంపు సమస్య నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే పెండెం దొరబాబు పట్టణ వాసులకు తెలిపారు. శుక్రవారం ఆయన పిఠాపురం 15వ వార్డు సచివాలయ పరిధి 28వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారికి అందుతున్న పథకాలను వినిపించి అవన్నీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఏలేరు కాలువ నీటి విడుదల సమయంలో పట్టణంలో కొన్ని వార్డుల్లో నీరు రోడ్లపై ప్రవహించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆయనకు వివరించారు. దీనిపై స్పందించిన ఆయన నీటి పారుదల శాఖ, మున్సిపల్ అధికారులతో మాట్లాడి వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు. అక్కడి నుంచే ఆయన అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించిన రూ.20 కోట్లతో పట్టణ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పిఠాపురం: స్థానిక సీతయ్యగారితోట ప్రాంతంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నట్టు పట్టణ పోలీసులు తెలిపారు. స్థానిక వీఆర్‌ఓ సమాచారం మేరకు సీతయ్యగారి తోట ఏరియాలో మున్సిపల్ పార్కు గోడపై సుమారు 50 ఏళ్ల వయసు ఉన్న ఒక వ్యక్తి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడి చేయి మీద రాంబాబు అనే పచ్చబొట్టు ఉండగా మెడలో వెండి తాయత్తు, ఎరుపు, నీలం రంగు గీతల ఫుల్ హ్యాండ్స్ షర్టు, నీలం రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు. మృతుని వివరాలు తెలిసిన వారు సీఐ 94407 97523, ఎస్సై 94407 96560 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కుక్కల దాడిలో 8 మందికి గాయాలు

సామర్లకోట: పట్టణ పరిధిలో కుక్కల దాడిలో 8 మంది గాయపడ్డారు. 26వ వార్డు పెనుపోతుల వారి వీధిలో కుక్కలు పిల్లలు, పెద్దలు, మహిళలను కాటు వేశాయి. మున్సిపల్ అధికారులు కుక్కల బెడదను పరిష్కరించాలని కౌన్సిలర్ నక్కా లలిత, వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా జానకిరామయ్య డిమాండ్ చేస్తున్నారు.

ఎన్‌సీసీతో ఉజ్వల భవిత



ఎన్‌సీసీ విద్యార్థులకు 'ఏ' పరీక్ష నిర్వహిస్తున్న బెటాలియన్ కల్నల్ తదితరులు

ఏపీఎస్పీ 18వ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ నాయక్

పెద్దాపురం: ఎన్‌సీసీతో విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఏపీఎస్పీ 18వ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ వరుణ్ భారతీయ నాయక్ అన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో శుక్రవారం పెద్దాపురం, హంసవరం, ప్రత్తిపాడులకు చెందిన ఐదు పాఠశాలల నుంచి హాజరైన సుమారు 150 మంది విద్యార్థులకు ఎన్‌సీసీ 'ఏ' అర్హత పరీక్ష నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన సాగిన సభను ఉద్దేశించి వరుణ్ భారతీయ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ క్రమ శిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థి దశ నుంచే ఎన్‌సీసీలో మంచి కీలక పాత్ర పోషించాలన్నారు. పాఠశాల డైరెక్టర్ విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక ఉల్లాసానికి ఎన్‌సీసీ దోహద పడుతుందన్నారు. 18వ బెటాలియన్ సుబేదార్ మహ్మద్ సయ్యద్, బెటాలియన్ హవల్దార్ మేజర్ వై.గోపాలకృష్ణ, పాఠశాల అకడమిక్, కల్చరల్ కో-ఆర్డినేటర్లు ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల వివరాలు ఇవ్వండి

సామర్లకోట: జగనన్న కాలనీలో ఖాళీగా ఉన్న స్థలాల వివరాలను కౌన్సిల్ ముందు ఉంచాలని కౌన్సిలర్ నేతల హరిబాబు డిమాండ్ చేశారు. మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. స్థలాలు వచ్చిన వారిలో కొంతమంది చనిపోతే చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌ల దృష్టికి రాకుండా పేర్లు మార్చి ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని హరిబాబు తెలిపారు. దీంతో ఒకే నెంబరు పట్టా ఇద్దరికి రావడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. దీనిపై అధికారులు పెండింగ్‌లో ఉన్న పట్టాలపై పూర్తి స్థాయిలో వివరణ ఇవ్వాలని కోరారు.

ఘనంగా గొల్లమారమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దొరబాబు తదితరులు

కొత్తపల్లి: మండలంలోని రమణక్కపేట గ్రామ దేవత గొల్లమారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ సేవా కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన చేశారు. సమీప గ్రామాల నుంచి సుమారు 4 వేల మంది భక్తులు వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే దొరబాబు ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని, అన్నదానానికి రూ.10 వేలు అందించారు. ఆలయ అభివృద్ధికి టీటీడీ ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు అనాల సుదర్శన్, కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ సహిత భావనా రుషి కల్యాణం



108 కలశాలతో గ్రామోత్సవం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో శుక్రవారం మార్కండేయ సహిత భావన రుషి కల్యాణం నిర్వహించారు. సుగంధ జలాలతో కూడిన 108 కలశాలతో గ్రామోత్సవం నిర్వహించి ఆ జలాలతో స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అర్చకుల ఆధ్వర్యంలో సౌభాగ్య స్త్రీలచే మహా గణపతి పూజ, కలశ ఆవాహనలు చేశారు. వందలాది మంది భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్ని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పైప్‌లైన్‌కు మరమ్మతు చేయండి

కొత్తపల్లి: పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో తాగునీటి ప్రధాన పైపులైను మరమ్మతులకు గురైంది. వాకతిప్పలో ఉన్న నాగులాపల్లి ఏరియా రక్షిత నీటి పథకం సమీపంలోనే పైపులైన్ పాడవడంతో కొన్ని నెలలుగా తాగునీరు వృథా పోతుంది. పైపులైను రోడ్డు మధ్యలో ఉండడంతో వృథా నీటితో పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ గొయ్య ప్రమాదకర మలుపులో ఉండడం వల్ల వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బీ అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పెద్దాపురం: కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా ఉన్నపుడే సమస్యలు పరిష్కారమవుతాయని ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు చింతల సత్యనారాయణ అన్నారు. ఎలక్ట్రికల్ బల్బును కనిపెట్టిన థామస్ ఆల్వా ఎడిసన్ జయంతిని శుక్రవారం పట్టణ ఎలక్ట్రికల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శుక్రవారం సంఘ అధ్యక్షులు తాడిశెట్టి గంగ కార్మిక జెండాను ఆవిష్కరించారు. అనంతరం యాసలపు సూర్యారావు భవనం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ జేఎస్ రామారావుకు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, డి.క్రాంతికుమార్ నాయకులు పాల్గొన్నారు.

ఆపద మిత్రల ఫీల్డ్ విజిట్



ఉండూరులో వివిధ అభివృద్ధి పనులను పరిశీలించిన ఆపద మిత్రలు, ఈటీసీ సిబ్బంది

సామర్లకోట: ఆపద మిత్రలకు ఇస్తున్న శిక్షణలో భాగంగా తరగతి గదిలో నేర్చుకున్న అంశాలపై శుక్రవారం ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ఆపద మిత్రలను 9వ రోజు మండల పరిధిలో ఉండూరు గ్రామానికి తీసుకువెళ్లారు. గ్రామంలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. గ్రామంలో పంచాయతీ రాజ్ సాంకేతిక విషయాలను పరిశీలించి, గ్రామ మ్యాప్ వేసి గుర్తించిన అంశాలను వివరించారు. ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో మేనేజరు పి.శ్రీనివాసరావు, ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, నిహారిక, వెంకటేశ్వరరావు, విపత్తుల నివారణ సంస్థ మేనేజర్ కిరణ్మయి ఆపద మిత్రలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి నాటిక పోటీలు



రెండు నిశ్శబ్దాల మధ్య నాటిక బృందానికి ప్రథమ బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

- ఉత్తమ నాటికగా 'రెండు నిశ్శబ్దాల మధ్య'
- ద్వితీయ బహుమతి 'గమ్యస్థానాల వైపు..'

పెద్దాపురం: మండలంలోని చంద్రమాంపల్లిలో స్నేహ ఆర్ట్స్ వారిచే మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి నాటక పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ప్రథమ నాటక కళా పరిషత్ పోటీల్లో ఉత్తమ గుంటూరు అభినయ ఆర్ట్స్ ప్రదర్శించిన 'రెండు నిశబ్దాల మధ్య' నాటిక ప్రథమ బహుమతి సాధించింది. రెండో బహుమతిని కొలకలూరు శ్రీసాయి ఆర్ట్స్ వారి 'గమ్య స్థానాల వైపు' దక్కించుకుంది. అలాగే మూడో బహుమతిని చిలకలూరిపేట అంజనా థియేటర్స్ వారి 'నాన్నా నేనొచ్చేస్తా' కైవసం చేసుకుంది. ఉత్తమ రంగాలంకరణ శ్రీసాయి ఆర్ట్స్ (గమ్యనాలవైపు), ఉత్తమ సంగీతం లీలా మోహన్ (రెండు నిశబ్దాల మధ్య), ఉత్తమ ఆహార్యం థామస్ (గమ్య స్థానాల వైపు), ఉత్తమ క్యారెక్టర్ నటుడు విజయమోహన్ (గమ్య స్థానాల వైపు), ఉత్తమ నటి అమృతవర్షిణి (నాన్నా నేనొచ్చేస్తా), ఉత్తమ సహాయ నటిగా జి.లహరి (నాన్న నేనొచ్చేస్తా), ఉత్తమ సహాయ నటుడుగా గోవర్ధన్ (దా 'రుణం'), ఉత్తమ హాస్య నటుడిగా జీఎస్ చలపతి (మనిషి మంచోడే)కి లభించాయి. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కె.శాంతారావు, డాక్టర్ ప్రసాద్, గోగులపాటి రాంబాబు వ్యవహరించగా డి.క్రాంతికుమార్, ఐద్వా నాయకులు కూనిరెడ్డి అరుణ, గొందేశి రాజా, వెన్నా పండు, నానాజీల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. నాటక కళా పరిషత్ పోటీలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేశి రాజా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేదారి నాగు, ఎం.సత్తిబాబు, దేవాడ పాపేశ్వరరావు, కంటిబోయిన ప్రసాద్, జ్యోతుల దొరబాబు, సమ్మెట గంగాధర్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు సేవ చేయడం వరం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: విభిన్న ప్రతిభావంతులకు సేవలందించడం ఓ వరమని ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో శుక్రవారం తన తండ్రి తిరుపతయ్య వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు భోజనాలను వడ్డించారు. ఆర్డీఓ మాట్లాడుతూ శాంతివర్ధన అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులకు సేవ చేస్తున్న వీరబాబు, సత్య దంపతులను ఆయన అభినందించారు. పాఠశాల ఏఓ వేణు, బాబి, అప్పలరాజు, శివ, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.